




## "గ్లోబల్ హాస్పటల్స్ - ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక

కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన సామాజిక కథ



# చెలమ



Anwar

యంబికాంతి

**"సుబ్బులూ! ఏయ్, సుబ్బులూ! లచ్చిం పిలుస్తుందే! నీళ్లకి పోతంది లాగుంది. లే... లే..." అంటూ నులకమంచంపై పడుకున్న సుబ్బయ్య పక్కనే చాపమీద పిల్లని పక్కలో వేసుకుని పడుకున్న సుబ్బులును లేపేడు.**

"ఏం...ద...య్యా అ...హా...ఆ! ... అ. బ్బా.. ఇ... ప్పుడే పడుకున్నట్టు వుంది. అప్పుడే తొలికోడి కూసిందా! అబ్బా వొళ్లంతా పచ్చిపుండులా ఉంది. ఒక్క కునుకట్ట తీశానో, లేదో కోడికూసే యేళ్లైపాయె. ఏం బతుకయ్యా అర్ధరేత్తిరికాడ మద్దెల దరువన్నట్టు, బిందెలు పట్టుకోని నిదరకళ్లతో ముసలాయ గుంటకు పోవాలి. యాడ ఊరు, యాడ ముసలాయగుంట. ఆడకిబోయి ఆ సెలమల్లో సుక్కా సుక్కా దోర్సుకోని దోర్సుకోని ఒక్క బిందె తెచ్చుకునేతలికి మొణ్ణాలు ఇరసక పోతుండై. అదీ గూడా మనం ఆ లచ్చిమోళ్ల సెలమ్మీదే ఆదార పడాల్సుండే. నువ్వా! లెక్కకి మడిసివైపోతివి." అనుకుంటా వొళ్లిరుసుకుంటా పైకి లేసింది.

"వాళ్లాయనేమో అర్ధరేత్తిరికాడపోయి వాళ్ల సెలమ దగ్గిర మంచమేసుకోని కాపలా పడుకుంటాడయ్యా. ముందు వాళ్ల బిందెలు నిండితేగాని మనకి నీళ్లియ్యరైతిరి."

"సర్లే ఎంతసేపు జెప్పినా ఒకటే సోవగదా! చిన్నదాన్ని తీసుకోని పక్కలో యేసుకో!"

"వ్మాయ్ సుజాతా లేవమ్మాలే" అంటూ పెద్దకూతుర్ని తట్టింది. "ఏందమ్మా! అప్పుడే తెల్లారిందా!" అంటూ అటువైపుకు పొర్లి పడుకుంది. "కాదమ్మా మనకొక కొలువుందిగా! నీళ్లకి పోదాం లేమ్మా!" అంటూ

బతిమలాడింది.

"అమ్మా నాకు నిదరొస్తందే. నేన్రాను. నువ్వు బోయి తేమ్మా" అంటూ కళ్లు మూసుకునే పడుకుంది.

"ఎట్టమ్మా ఒక్క బిందె తెస్తే ఎట్ట చాల్తయ్యి. తెల్లారి పడుకుందువుగానీ లేమ్మాలే! మమ్మ మంచి దానివి గదా! లేమ్మా లచ్చిం పిన్ని ఎదురుజూస్తంది లేమ్మా" అంటూ బతిమలాడసాగింది.

ఇంక తప్పదన్నట్టు సుజాత పైకిలేసి మూసుకుపోతున్న కళ్లతోనే కూర్చుంది.

ఇంట్లోకి పోయి రెండు స్టీలు బిందెలు తెచ్చి, కూర్చునే నిద్రపోతున్న సుజాతని రెక్కబట్టుకు లేపింది.

ఆ.. ఆ... అంటూ ఆవలిస్తూ పైకి లేసి అమ్మతోదాటే వెనక నడవడం మొదలుబెట్టింది.

ఊరికి మైలు దూరంలో పొలాల దగ్గిర ఉన్న ముసలాయగుంటలో ఎప్పుడూ మూడొందల అరవైదురోజులూ నీళ్లుంటాయి... అట్టాంటిది ఇయ్యేడు దాన్లో కూడా నీళ్లయిపోతే మొల్లోతున చెలమలు తీసి, ఊరు ఊరంతా అక్కడే కాపలా కాస్తంది.

మొట్ట మొదట ఒకరి చెలమలో ఇంకొకరు తోడుకోవడంతో గొడవలయినయ్యి. దాంతో తన్నుకోవడం తలకలు పోసుకోవడం ఒకటి రెండు తలకాయలు పగలడం గూడా జరిగింది. ఈ గోలంతా ఎందుకని ఎవురి చెలమ దగ్గిర వాళ్లు రాత్రంతా కాపలా పడుకోవాల్సొస్తంది. అప్పటికీ అప్పుడప్పుడూ కీచులాటలు జరుగుతూనే ఉండయ్యి.

లక్ష్మితోపాటు సుబ్బులూ సుజాతా ఇద్దరూ బిందెలు తీసుకొని నడుస్తున్నారు. దారి పొడుగూతా సుజాత తూగుతూనే ఉంది.

"అమ్మా నిదరొస్తంది కాళ్లు లాగుతున్నయ్యే" అంటూ అల్లాడిపోతంది.

అయ్యో బిడ్డకెంత కష్టమొచ్చిందే! అయ్య బాగుండంత కాలం ఎంత దర్జాగా ఉండింది బతుకు. మొనగోడు పని జేసేోడు కదా! అంత పనోడు ఈ చుట్టు పక్కలా ఎక్కడా లేడని పేరు మోగిపోయేడు గదా! గోడలపై బొమ్మల్ని సిమెంటు తోటి ఎంత చక్కంగా చెక్కేవాడు. ఏదన్నా వొక బొమ్మ జాయించారంటే దించేసేడన్నమాటేగా! ఎంతెంత దూరం నుండొచ్చేవాళ్లు. అట్టాంటోడి బతుకు ఎందుకూ కొరగాకుండా జేసెనే ఆ బగమంతుడు.

ఎక్కడో మూడో అంతస్తులో పన్జేస్తుంటే గదా సెనేస్రం నెత్తికెక్కి పరంజా జారి అక్కణ్ణుంచి పడితే జబ్బదాకా ఎడంకాలు తీసెయ్యాల్సొచ్చింది. కుడిచెయ్యి మోచేద్దాకా పడిన చోటే ఇరిగిపోయింది. మడిసి బతికి బట్టకట్టి ఇంటికొస్తే చాల్లే అని ఆనాడనుకున్నాను గానీ, ఆ మడిసి గూడా ఒక బిడ్డకింద లెక్కకొస్తాడని ఆనాడు అనుకోలేక పోయేను. మడిసి జల్మం ఎంత ఉక్కిష్టబ్బతుకోగదా!

ఇప్పుడాయన బదులు ముక్కుపచ్చలారని ఈ బిడ్డని బాధ పెట్టాల్సొస్తంది. తప్పేదేముంది? గాశారం చుట్టుకున్నాక. పాపం పిల్లముండ అమ్మా నేను బడికిపోతానే నా తోటోళ్లందరూ బలే చదువుకుంటుండారే ఊళ్లో బడి ఐద్దాకా సదివిస్తివి. ఇంక ఈ పిల్లనొకదాన్ని నా యెదానేసి సదువు మాన్పిస్తివి. వాళ్లంతా ఎనిమిదులు తొమ్మిదులు చదువుతున్నారు. అమ్మా... మ్మా.. ఇప్పుడన్నా పోతానే అని ఎన్నోసార్లు వాపోయింది. ఆయన కాగతి పట్టకపోయుంటే ఎందుకాపేదాన్ని. మొనగోడి చదువే చదవకపోయిందా! దాని కర్మ అట్ట కాలాలని దాని నుదుటి మీద రాసుండి వాళ్లయ్య మంచాన బడ్డాడు. పిల్లని గూడా సముదాయించలేని దరువు కదా ఆయునిది. 'తా దూరను కంతలేదు మెడకొక డోలా' అని ఆయన పనులు జేసుకోవడానికి కనాగష్టమైపోయే. అట్టాంటిది పిల్లని బట్టుకోను దీన్ని బడికి పంపలేకే గదా! దీని సదువు సట్టు బండలయ్యింది. అనుకుంటా పరధ్యానంగానే సుజాత బుజమ్మీద చెయ్యేసి ముసలాయ గుంట దాకా తీసుకొచ్చింది. ఆ చీకట్లో జలజలా రాలిన కన్నీళ్లను పమిట చెంగుతో తుడుచుకోవడం ఎవురూ చూళ్లేదు.

"అమ్మా! సుజాతా ఆ మంచంమ్మీద పడుకో పోమ్మా! పోయేటప్పుడు లేపుతాము" అంటూ మంచం చూయించడంతోటే దబ్బుని మంచమ్మీద పడిపోయింది.

"పాపం పసిముండని అల్లాడిస్తన్నావు గదే అర్ధరేత్తిరికాడ" అంది లక్ష్మి. "చేసేదేముంది. రాతెట్ట రాసేవే రాగ్గింజంటే తగినట్టే రాస్తేనే రాసేనే తైదగింజ అన్నట్టుంది నా బతుకు." అంటూ చెలమ అంచునే చతికిలబడింది సుబ్బులు.

లక్ష్మి బిందె, వాళ్లాయన కావిడి బిందెలు నిండేక, అప్పుడు సుబ్బులు వొంతొచ్చింది. అడుగూ బొడుగూ దోర్సుకోని దోర్సుకోని బురదా మట్టితోటి చెరొక బిందె నింపుకుని ఇంటి కొచ్చేటప్పటికి తూరుపున పొద్దు పొడవనే పొడిసింది.

ఆదరా బాదరాగా బిందె ఇంట్లో బెట్టి కసువూ కళ్లాపి తీసింది. అంట్ల గిన్నెలు బయటేసి తోమి, నోట్లో బొగ్గేసుకుని రుద్దుకోని, మొహం కడుక్కోని పున్నీళ్ల కుండలో రాత్రి పూట వేసిన ముద్దనొక దాన్ని తీసి సత్తు టిపినీలో వేసుకుని, అన్ని పున్నీళ్లు బోసుకుని, పై గిన్నెలో రుద్దుడు గొరప్పచ్చడి వేసి, టిపినీ బెట్టుకునే సరికి పొద్దు కరకరా బారెడు పైకెక్కింది.

అయ్యో! యేళయినట్టుందే! అనుకుంటూ "అమ్మా సుజాతా పున్నీళ్ల కుండలో నాలుగు ముద్దలుండయ్యి గనే అయ్యకి బెట్టి నువ్వూదిను. పిల్లదానికి నాలుగుసార్లు నాలుగంతలు బెట్టమ్మా, ఇల్లు అదీ జాగర్త. అయ్య సద్దికూడు తిని



'మంచికంటి' కలం పేరుతో రాసే నా పూర్తి పేరు మంచికంటి వెంకటేశ్వరరెడ్డి. పుట్టింది కలికివాయ ఊరు, సింగరాయకొండ మండలం. నివాసం ఒంగోలులో. ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నాను. కవితలు కూడా రాస్తాను. 'వసంతాల ఊసెత్తకు, నీటిపొద్దు, మేం పావురాల్ని ప్రేమిస్తాం (దీర్ఘ కవిత)' అనే కవితా సంకలనాలు వచ్చాయి. కథకునిగా తానా బహుమతి అందుకున్నాను. ఒంగోలులో నెలనెలా సాహితీ అధ్యయన వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను.

నిదరబోతాడేమో కనిపెట్టుండమ్మా. మళ్లీ జెరం తిరగబెట్టుద్ది. జాగర్తమ్మా! ఆ! నే వొస్తా" అయ్యో బారెడు పొద్దెక్కిందే. అందరూ యెల్లేరో ఏం పాడో అనుకుంటూ కుచ్చిళ్లు ఎగబట్టి పరుగు లంకించుకుంది.

అప్పటికే అందరూ రోడ్డుమీదకొచ్చి లారీలకోసం చెయ్యెత్తుతుండారు. "ఆ... ఆ.. రాయె సుబ్బులా నీ అదురుష్టం ఎట్టుందో పరీచ్చ చేద్దాం. ఇప్పటికి ఎన్ని లారీలొచ్చినా, ఒక్క సచ్చినోడు గూడా ఆపలేదు. అదుగో! టిప్పరొస్తంది అందర్రాండి" అంటూ రోడ్డు మధ్యలో కొచ్చి గుంపుగా నిలబడి ఆపమన్నట్టుగా

చేతులు పైకెత్తి గోలగోలగా అరిచేరు.

టిప్పర్ స్లో అయింది. అందరూ పక్కకొచ్చారు ఎక్కడానికని. చెయ్యి బైటికి బెట్టి ఖాళీ లేదు ఖాళీలేదు అంటూ స్పీడుగా లాగించేడు డ్రైవర్.

"యెదవ నా బట్టని" గుంపులో నుండి కసిగా తిట్టేరెవురో ఉక్రోషం పట్టలేక.

"ఏ..యే..య్ ఇంకో టిప్పరొస్తందే. ఎట్టయినా సరే ఈణ్ణొదిలి పెట్టేదేలేదు. అందరూ చేతుల్చేతులు పట్టుకోని రోడ్డుకడ్డంగా నిలబడండీ ఎట్టా ఆపడో ఆనాకొడుకు. వాడంతు జూద్దాం" అంటూ అందర్నీ చేతుల్చేతులు బట్టిచ్చింది జయమ్మా. దెబ్బకి బండాగిపోయింది."

"ఏందమ్మా మేముండాలా! మీ సలవతో కటకటాల్లెక్కబెట్టాలా! రోడ్డుకి అడ్డంగా తగలబడ్డారే మీ బాబుగాడేసిన రోడ్డులాగా." అంటూ విసుక్కున్నాడు డ్రైవర్.

"ఏందో లేన్నా కడుపాత్రం కోసం మైళ్లకు మైళ్లు యెల్తన్నాం. యేళ దాటిందంటే అంత దూరమూ పోయి ఉసూరుమంటా యెనక్కి తిరిగి రావాల్సొచ్చుద్దని తొందర పడ్డాంలే! అన్నా కోపం తెచ్చుకోమాకు" అంటూ టైరుదగ్గిరకొచ్చింది జయమ్మ.

"యాడదొరికేర్రా నాయనా అడివి మడుసులు లాగుండేరో!" అనుకుంటూ డ్రైవర్ సిగిరెట్టు వెలిగించుకున్నాడు.

"ఏందన్నా ఈ టైర్లు చీమకుర్తి కొండంతెత్తు నుండయ్యి. అంటూ టైరు మధ్యలో కాలుబెట్టి పైకెక్కబోయి కిందకి జారింది జయమ్మ." అయ్యోరామా అయ్యోరామా!" అనుకుంటూ దోక్కుపోయిన మోచేతిని చూసుకుంటూ" "ఏందన్నా టైర్లు పోయి పోయి ఆకాశంలో ఉండయ్యి." అంటూ మళ్లీ టైరు మధ్యలో కాలుబెట్టి టైరు పెకెక్కి బాడీరేకు పట్టుకుని టిప్పర్లోకెక్కి హమ్మయ్య అంటూ గట్టిగా శ్వాస వొదిలింది.

"అమ్మో కాస్త పసేసకం పడకుండా జాగర్త గెక్కండమ్మా. మొన్నటికి మొన్న అగ్గురారం కాడ ఇట్నే ఒకమ్మాయి టైరుమీదగా ఎక్కుతానే ఉందంట ఆ డ్రైవర్ సచ్చినోడు చూసుకోకుండా కదిలిచ్చేండంట అంతేనమ్మా! అబ్బా... చెప్పటానికే ఈల్లేదంట. టైరుకింద బడి పిసురు పిసురు అయిందంట. అబ్బా అత్తల్సుకున్నప్పుడల్లా వొళ్ళు జలదరిస్తుంది. అందుకే ఎవురి జాగర్తలో వాళ్లుండటం మంచిది" అంది సుబ్బులు.

"అంత జాగర్తలు చెప్పేవోళ్లు బస్సులో రావొచ్చుగా?" అన్నారెవురో దీర్ఘం తీస్తూ.

"ఎవురమ్మా ఆ నాపసాని ముక్క. నా నోటికి మంచి కూతలు రావు. ఇంతదూరమూ గంపెడు చీకట్నే బుజానేసుకునే పోతంది నాలుగు రూపాయలు సంపాయించి కడుపుకేసి కట్టుకోటానిగ్గానీ సావడానిక్కాదుగా! గడ్డీ గాదం తిని ఈ లారీలూ టిప్పర్లూ ఎక్కుతుంది నాల్రూపాయలు మిగిల్తే గుడ్డకో గోసికో అడ్డమొస్తయ్యనేగదా!" అంటూ సుబ్బులు సబ్బండో అంటూ నాలుగూ బెట్టింది. ఆ మనిషి మళ్లీ నోరెత్తితే ఒట్టు. కిమ్మిన్నాస్తిగా ఉండిపోయింది.

సుబ్బులు అందరితోపాటు ఒక బండరాయి చ వా స ు కొ ని కూర్చుంది. రాళ్ళు



కోసుగా పె ం చ దె లి అప్పుడే పదును బెట్టిన గొడ్డళ్ల మాదిరిగా ఉండాయి. అందరూ ఎక్కగానే టిప్పర్ బయల్దేరింది.

ఎత్తుకోవడమే అరవై కిలోమీటర్ల స్పీడెత్తుకుంది. గతుకుల రోడ్డు. బాడీ పైకీ కిందకీ ఎగురుతుంది. బాడీతోపాటు మనుషులు కూడా ఎగిరెగిరి పడుతున్నారు. రాళ్లు కసుక్కున గుచ్చుకుంటున్నయ్యి. ఇక జాడూ టిప్పర్లో "అమ్మో నాయనో, దేముడో, రాముడో" అంటూ ఒకటే అరుపులు. "అయ్యా ఇంత ఇకారంగా తోలకపోతే కాస్త చిన్నంగా పోనియ్యొచ్చు గదా! వొళ్లు హూనమైపోతంది". అంటూ కేకలు బెట్టేరు.

క్లీనర్ బాడీ పైకొచ్చాడు. టిప్పర్ స్పీడు తగ్గింది. "ఆ... ఆ... ఏంది అంతా మెట్టు కూలీకేనా? తియ్యండి తియ్యండి డబ్బులు తియ్యండి" అన్నాడు. "ఏందిరా... ఆ! ఏంది తీసేది. ఏం దెంగు దెగులంటా ఆ యెదవ సచ్చినోడికి మా మీద కసంతా తీర్చుకుంటన్నట్టే ఉంది గానీ బండి నడిపినట్టు లేదు. కాస్తె చిన్నంగా బోతే వాడి ముల్లెంతా ఏం బోయిందంట అంత లగూ లగూ మీదుండాడు." అంటూ కొంగునున్న మూట విప్పి చిల్లర తీసిచ్చింది జయమ్మ.

"ఏందమ్మా నాలుగేనా! ఇంకా నాలుగియ్యండమ్మా ఎంతదూరం నుంచొస్తుండారు." అన్నాడు క్లీనర్.

"ఓరి పోరా పోకిరెదవా! అయ్యి జాల్లే ఈడ తిమ్మన్న బంతికి" అని జయమ్మ అంటంతోటే అందరూ వంత పాడేరు.

"సర్లర్లే మ్మా... సర్లే" సచ్చినోడి పెళ్లికి వొచ్చిందే జమన్నట్టు అందరి దగ్గరా వొసూలు జేసుకుని క్లీనర్ కేబిన్లో కెళ్లేడు.

***

ఒంగోలొచ్చేసరికి అందరి ఒళ్లంతా ఎర్రదుమ్ము కప్పేసింది. బైపాస్ సెంటర్. నాలుగురోడ్ల కూడలి. నాలుగు వైపుల్నుంచీ రొద చేస్తూ కదుల్తున్న వాహనాలు. మెట్టు దగ్గర ఎటు జూసినా గుంపులు గుంపులుగా తిరణాలను మరిపించే జనం. యాణ్ణుంచొస్తన్నారో ఉసుళ్ల పుట్ట పగిలినట్టే ఉంది గానీ జనంలాగాలేరు. ఎంతెంత దూరాన్నుంచొస్తన్నారు." అటు జూడండీ చీమలబారుల్లాగా వొస్తానే ఉండారు" అంది సుబ్బులు.

"తొందర తొందరగా దిగండమ్మా తల్లుల్లారా. ఇప్పటికే ఎంతమంది గుంపులు పోగులు పడ్డారో చూడండి." అనుకుంటూ హడావుడిగా దిగింది జయమ్మ. దిగీ దిగటంతోటే చుట్టూ బార జూసింది. "ఓరినాయనో ఇదెక్కడి జనంరా తండ్రీ!" అని బుగ్గలు నొక్కుకుంటా దక్షిణపక్కకి జూసింది.

"ఆ పక్కకి బాండి. అక్కడందరూ సద్దికూళ్లు తాగుతుండారు. మనం గూడా దోసెడు తాగుదాం. మళ్లీ మేస్తుర్లొస్తారు." అంటూ అటువైపుగా దారితీసింది జయమ్మ.

"ఏం సుబ్బులూ ఏంది నిలబడ్డావు కదులూ. కడుపులో మండిపోతంది కాస్తతాగొద్దాంరా!" అంది జయమ్మ.

అయినా కదల్లేదు.

"ఇంటికాడే తాగొచ్చినట్టుంది. నిబ్బరంగా

నిలబడింది" అంది అరుణ. "ఆ నా బతుక్కి అంతా నిబ్బరమేలే, మీరెల్లి తాగిరాండి" అంటూ అక్కడే పరధ్యానంగా నిలబడింది.

"పాపం దాని మొగుడు పరంజా మీద నుండి పడ్డప్పట్నుండి దాని జాతకమే మారిపోయింది. అంతకుముందు ఇంటోకాలు బైట బెట్టెరగదు. దాని మొకానంత వొరికే రాసిపెట్టేడా బగమంతుడు." అనుకుంటూ ముందుకెళ్తుంటే తుపుక్కున ఉమ్మేడు. ఆ పక్కనే కూచున్న ముసలాయన.

అదొచ్చి అరుణ చీరమీద పడింది. "ఏయ్ ముసిలోడా బుద్ధిలేదా నీకు మడుసులు కూడా కనపట్టం లేదా" అంటూ గదమాయించే సరికి, "అమ్మామ్మా సూళ్లేదమ్మా సూళ్లేదు" అంటూ బీడీ నేలకేసి రుద్ది ఆర్పేశాడు.

"యాడమ్మా ఈడ కూళ్లు తాగేదీ? అటు జూస్తే అంతా ఉచ్చల మడుగులు ముక్కులు పగిలిపోతన్నయ్యి. అటేమో బీడీలూ, సిగరెట్లూ ఉమ్ములు." అంటూ చీదరించుకుంది అరుణ.

"ఏమేయ్ అరుణా ఇదేమన్నా అమ్మగారిల్లను కున్నావా అత్తగారిల్లనుకున్నావా! ఆ నోర్మూసుకుని అటు పక్కన కూసోని కానియ్యి అవతల మేస్తుర్లొచ్చేయేళయింది. ఈడ తినే వోళ్లంతా మహా మహా పోటుగాళ్లేలే. కానియ్ కానియ్" అంటూ ఒక పక్కన కూర్చుంది జయమ్మ.

అట్ట కూర్చుందో లేదో గుంపులో కలకలం బయలుదేరింది. పైకి లేసేసరికి ఒకర్నొకరు తోసుకుంటా వున్నారు.

"ఏం జరిగిందమ్మా!" అంటూ ఒక ఆడ మడిసి నడిగింది జయమ్మ.

"ఏముందమ్మా! ఈడొక ముదురు నా బట్టుండాళ్లే అందరికీ లీడరు. ఎప్పుడూ ఆడోల్లందరూ వాడి ముడ్డెనకాలే తిరుగుతా ఉండాల. ముండల పకీరు వాడొక ముఠామేస్తిరి. ఆ ముఠాలో పిల్లనేదో గిల్లినట్టుండాడు ముచ్చు నా బట్ట. ఆ పిల్లేం జేసిందో ఏమోమరి! ఇయ్యాల్టినుంచి నువ్వు మా ముఠాలో వొద్దు కూకుంటే లేవలేవు లేస్తే కూకో లేవు అంటా దబాయించేడు. ఆ ముఠాలో ఆడోళ్లందరికీ వొళ్లు మండిపోయింది. నువ్వాడిందల్లా ఆటా పాడిందల్లా పాటా అంటూ టిపినీ ల్లీసుకోని బాదేరు. అందుకే అటీటూ తోసుకుంటా నెట్టుకుంటన్నారు. కడుపొత్తరానికే గదంటమ్మా అందరమూ వొచ్చింది. కలికాలం తల్లీ డబ్బెంత పనైనా జేసుద్ది." అనుకుంటా ఆమె వెళ్లిపోయింది.

ఆ గొడవ సద్దుమణిగేక జయమ్మా మిగిలిన వాళ్లూ సద్దికూడు తాగి వాళ్ల ముఠా దగ్గిరకి పోయి కూర్చొని మేస్తుర్లకోసం చూడసాగేరు.

***

మేస్తుర్లు ఒక్కొక్కరే డుర్ డుర్‌మంటూ మోటార్ సైకిళ్ల మీద రాసాగేరు. అయితే వొచ్చినోళ్లు వొచ్చినట్టు, ఎవురిక్కావాల్సినోళ్లని వాళ్లు పిల్చుకుని పోయే వోళ్లు ఎప్పుడూ. ఇయ్యాల వొచ్చినోళ్లొచ్చినట్టు సతికిల పడుతుండా రేందో అనింది ఒకామె.

"సూడమ్మా! ఎన్నేళ్ల దగ్గర్నుంచో మెట్టు దగ్గరకొస్తుండాము. మన మట్నే ఉండాము. కొత్తల్లో ఆ మేస్తుర్లు ఒక్కోడు ఒక్కో డొక్కు సైకిలేసుకుని వొచ్చేవాడు. తరవాత్తరవాత చిన్న చిన్న మోటార్ల మీదొచ్చేవాళ్లు. ఇప్పుడు జూడండే ఎట్టా మెరిసిపోతన్నయ్యో ఈ రోవోండా లంటమ్మా. ఇప్పుడు వాటిమీద ఊరేగుతా వొస్తన్నారు.

ఆ మస్తాను మేస్త్రి. సోకు జూడండే సిల్కు


# లివర్ ఎలర్ట్!

ఆరోగ్య వంతమైన కాలేయం (లివర్) మీకు ఎంతో అవసరం!

కాలేయం చెడిపోవడానికి కారణాలు ఏమిటి?
- అతిగా మద్యం సేవించడం
- వైరస్ సోకడం
- అనవసర మందుల వాడుక

ఇది ఎంత ప్రమాదకరం?
- కాలేయం శాశ్వతంగా కృశించిపోవచ్చు
- కాలేయ వైఫల్యం చెందవచ్చు
- కాలేయం క్యాన్సర్ రావచ్చు

దీన్ని అరికట్టేందుకు మీరేం చేయవచ్చు?
- రోజువారీ జీవన విధానంలో మార్పు
- పరిమితంగా మద్యపానం
- అనవసర మందులు ఆపడం



కాలేయ సమస్యలకు తక్షణచికిత్స అవసరం!

వెంటనే కాలేయ వ్యాధుల ప్రత్యేక వైద్య నిపుణులను (లివర్ స్పెషలిస్టు) సంప్రదించండి !!

EMERGENCY 24 Hrs SERVICE

ఎన్నో ప్రత్యేకతలు కలిగినది గ్లోబల్ హాస్పిటల్స్
- ప్రత్యేక లివర్ క్లినిక్
- లివర్ ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ (మార్స్ తో లివర్ డయాలసిస్)
- కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సకు అనువైన వ్యవస్థ
- అత్యాధునిక డయాగ్నొస్టిక్ మరియు ఇమేజింగ్ సౌకర్యాలు
- సుశిక్షితులైన, స్పెషలిస్టు డాక్టర్లు

లివర్ చెకప్‌లో చేసే పరీక్షలు
- లివర్ ఫంక్షన్ టెస్ట్ • జి.జి.టి.
- యాంటి హెచ్‌బిసి • యాంటి హెచ్ సి వి
- ప్రోథ్రాంబిన్ టైమ్ • హెచ్‌బిఎస్ ఏజి
- అల్ట్రాసౌండ్ -అబ్డోమిన్
- కాలేయ నిపుణులు, ఆహార నిపుణులతో సంప్రదింపులు

EXCELLENCE THROUGH TEAM WORK

సంప్రదించండి ఫోన్ : 23234567

అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలకోసం ప్రత్యేకంగా దేశంలోనే ప్రప్రథమంగా ఏర్పాటైన గ్లోబల్ హాస్పిటల్స్ ఇప్పటికే కాలేయం, మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు ఎన్నో విజయవంతంగా చేసింది.

గుర్తింపు:
ఇ.ఎస్.ఐ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏ.పి. ట్రాన్స్‌కో, ఏ.పి.జెన్ కో, సి.పి.డి.సి.ఎల్ బి.డి.ఎల్, ఎన్.ఎం.డి.సి

గ్లోబల్ హాస్పిటల్స్

సి.జి.హెచ్.ఎస్, ఆరోగ్య భద్రత, దక్షిణమధ్య రైల్వే, సింగరేణి కాలరీస్ మరెన్నో ప్రముఖ సంస్థలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజి, లివర్ డిసీజస్, రీనల్ డిసీజస్, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ, కోలోరెక్టల్ సర్జరీ, ఆంకాలజీ, జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్

లకడీకాపూల్, హైదరాబాద్ - 500 004 ఫోన్: 040 - 23244444 (10 లైన్లు) ఫ్యాక్స్ : 23244455 వెబ్ సైట్ : www.theglobalhospital.com

TIME & SPACE

చొక్కా, మెళ్లో పులిగోరూ, బంగారం రంగు వాచ్చీ, బంగారం చైనూ తలకి రంగూ ఆ వొయిసులో ఎంత ముస్తాబై వొస్తాడో చూడండే!" అంటూ తనకు తెలిసిన విషయాలు చెప్పింది జయమ్మ.

అందరూ మేస్త్రుల్లొచ్చినా ఎవురూ వలానా వాళ్లికింతమంది, ఇంతమంది "కావాలి అని ఎవ్వరూ చెప్పలా. మన్ను దిన్న పాముల్లాగా అందరూ ఏదో గుసగుసగా మాట్లాడుకుంటుండారు. ఇదేదో గూడు పురాణీ లాగుందే" అన్నారెవరో!

చాలాసేపటి తరువాత "అందరూ ఇనండి" అంటూ చెయ్యి పైకెత్తాడు. ఉపోద్ఘాతంగా మస్తాను. ఎటు జూసినా కాలం సక్రమంగా లేదు. యాడకాడ ముగసకొస్తా వుంది. ఏట్లో వుట్టి వున్నేనికి తోలకొచ్చుకునే ఇసిగ్గూడా పిరిమైపోయింది. కంట్రాక్టర్లు ఎక్కడోళ్లక్కడ సతికిలబడి పోయేరు. ఎక్కడా సుక్క నీళ్లు లేవు. యాడా పనుల్లేక ఈ మెట్టుకాడికి ఎప్పుడూ రానంత మంది జెనంవొస్తుండారు చూడండి. అందుకే నిగ్గలేక యాడపనులాడ బందు బెట్టేరు.

ఎక్కడన్నా ఒకటీ అరా పనులున్నచోట మనం ఎగబడుతున్న విషయం కంట్రాక్టర్లు కని పెట్టేరు. అందుకే మేమంత కూలీ లియ్యలేము. తగ్గించుకోని చేస్తే చెయ్యండి లేకుంటే అందరితోపాటూ మేంకూడా పనులాపుకుంటాం" అంటూ బెదిరిస్తున్నారు" అంటూ అందరి మొకాల్లోకి చూస్తూ ఆపాడు.

"ఈ దిక్కులేని కాలంలో కూడా నాలుగువేళ్లూ నోట్లోకి పోవాలంటే తప్పదు మరి వాళ్లు జెప్పిన ప్రకారం పోవాల్సిందే, లేదా సామాన్లన్నీ సావన జుట్టి మూలన బడెయ్యాల్సిందే!" అంటూ తెగేసి చెప్పాడు.

"ఎంతేమిటి? తగ్గిచ్చింది" అన్నాడొకాయన గుంపులోనుండి.

"ఎంతైనా కావొచ్చు. తగ్గించి చెయ్యాలంటే చేస్తారా లేదా" కాసేపు మౌనం రాజ్యమేలింది. కొద్దిసేపు గుసగుసలు పోయారు.

"ఆ మా ఇష్టమెవుడిగ్గావాల్లే. మా సేతుల్లో ఉందా ఏంది? అంతా సెక్రం తిప్పే వోళ్లు మీరె గదా! ఏ పుట్టలో ఏ పాముందో ఎవురికి దెలుసు" అన్నాడొకాయన.

"ఈళ్ల తతంగం జూస్తుంటే ఈ మేస్త్రుల్లే అందరూ కుమ్మక్కయి నట్టుండారు. ఈ కరవ కాలంలో ఏ నాటకమేసినా సరిపోద్దని అనుకుంటుండారు మన గాశారం ఏం జేస్తాం" అంటూ వొకామె వాపోయింది. అయితే వినండి. మేస్త్రిరికి ఎనభై. పై మడుసులకి మొగోడికైతే యాభై. ఆడదానికైతే ముప్పై ఏదు. స్కిల్డు



**నిర్మాత మంచితనం**

సుస్మితాసేన్ ఓ పాపను పెంచుకుంటున్న సంగతి అందరికీ తెలుసు కదా. ఇటీవల అనిల్ కపూర్ సరసన చేస్తున్న 'బేవఫా-ది అన్‌ఫెయిత్‌ఫుల్' కోసం కెనడా కెళ్లింది సుస్మిత. కూతురు రీనికి ఒంట్లో బాగుండలేదని తెలియగానే తక్షణం బాగ్ సర్దుకుంది సుస్. నిర్మాత బోనీకపూర్ అన్నాట్ట కదా. "ముందు నీ కూతురి సంగతి చూసుకో. నీ కోసం షూటింగులు ఆపుతావులే" అని. మరీ ఇంత మంచితనమా?

వర్కర్సుకి యూనిట్‌కి మూడ్రూపాయలు తగ్గించేరు." అంటూ ఆగిపోయాడు.

"ఎహేయ్ ఈడు గుణ్ణే గుళ్లో లింగాన్నీ కూడా మింగేసే రకం లాగుండాడే మనమేం పోవొద్దు ఏ మొద్దూ గమ్మున కూచ్చోండి, తినకపోతే పస్తులన్నా ఉండి సస్తాం గానీ అస్తులన్నీ అరిగిపోయేటట్టుగా జేసి, వాళ్ళ మొకాన దారాగతం చెయ్యడానికా మనముంది" అంటూ పెనుకోపంతో వెనుదిరిగే డొకాయన. ఆయన్తోపాటు కొంతమంది వెనక్కు తగ్గేరు. వాళ్లని జూసి మిగిలినోళ్లు గమ్మున నిలబడ్డారు.

"తొందరగా తేల్చుకోండి. మీరెవురూ రాకపోతే ఇంకో మెట్టు కాడికిపోతాం లేదా వీళ్లల్లో ఎవురొస్తేవాళ్లేముందు, ఆ తరవాత అన్నా! నేనెప్పుడూ నీకాడే కదా చేసింది ఇయ్యాల కాదంటే ఎట్టని యెదవ మొహమాటాలు పెట్టినా లాభంలేదు." అంటూ జనాన్ని రెచ్చగొట్టసాగేడు మస్తాను. మిగిలిన మేస్త్రుల్లు ముసి ముసి నవ్వులతో చూస్తూ ఉన్నారు.

గుంపులో కలకలం మొదలైంది. అందర్లోనూ ఆందోళన నన్ను తీసుకుంటారో లేదోనని. అందుకే అందరూ వొక్కో అడుగు ముందుకేస్తూ మేస్త్రుల్ల దగ్గిరకి రాసాగేరు.

నీకు తెలుసుగదా ఈళ్లనాడి. యాడ నొక్కితే యాడ యెలుగుతుందో నాకు తెల్సుగదా! రావటానికి ఎవుడబ్బకి బాకీ. ఎవురికోసం వొస్తారేంది? రెక్కాడితేగానీ డొక్కాడనోళ్లు యాడకు బోతారు అంటూ గుంభనంగా నవ్వేడు.

కాస్తె నదురుగా ఉండోళ్లనీ, ఎక్కువకాలం నుండి పనిజేసే వోళ్లనీ ఏరేరి తీసుకుంటుంటే మిగిలినవాళ్లు, అప్పుడే మెట్టుకి కొత్తగా వొచ్చినోళ్లందరి గుండెల్లో గుబులు గుబులుగా ఉంది.

మేస్త్రుల్లంతా ఎవరిక్కావాల్సిన వాళ్లని వాళ్లు తీసుకుని, ఎక్కడెక్కడ ఏమేమి పనులు చెయ్యాల్సిందీ, ఎవురెవురు ఏమి చెయ్యాల్సిందీ వివరంగా చెబుతున్నారు. వలానావాళ్లు వలానా దగ్గిరకెళ్లండి. వలానోళ్లు వలానా దగ్గిరకెళ్లండి నేనక్కడ కొస్తానని మస్తాను బండి స్టార్టు జేసేడు. అట్టాగే మిగిలిన మేస్త్రుల్లందరూ తలోదారిన వెళ్లిపోయారు.

నన్నొక్కణ్ణి తీసుకోగూడదా! నన్నొక్కదాన్ని తీసుకోకూడదా! అని ఎవురికి వాళ్లే అనుకుంటాల పైకి చెప్పలేక, కక్కలేక, మింగలేక ఎంతో బాధని దిగమింగి, ఇయ్యాల్టికి శార్జీ డబ్బులు కూడా దండగేలే అనుకుంటా, అయినా ఆశ చావక ఇంకా ఎవురైనా వొస్తారేమో, తీసకెళ్తారేమో అనుకుంటూ అక్కడక్కడే కొంతమంది తారట్లాడుతున్నారు.

***

మస్తాను వొప్పుకున్న పనులన్నీ అపార్ట్‌మెంట్ పనులే. జయమ్మ, సూర్యమ్మ, కనకారావూ, కాంతయ్యా, నారాయుడూ, ఏసోబూలతోపాటు లక్ష్మి, సుబ్బులూ కూడా కర్నూల్ రోడ్లో అపార్ట్‌మెంట్ పనికి పంపించేడు మస్తాను.

నాలుగో ఫ్లోర్‌లో కట్టుబడి జరుగుతుంది. రెండు జోళ్ళు టాపీ మేస్త్రుల్లకి రాళ్లూ ఇసకా సున్నమూ నీళ్లూ అందియ్యడానికి నలుగురు పైమడుసులు. కట్టుబడి చక చకా జరిగిపోతా ఉంది. ఎవురి క్కావాల్సిన సామాగ్రి వాళ్ల కందిస్తున్నారు.

మిట్టమధ్యాహ్నమైంది. పొద్దు చరచర లాడుతుంది. అంతోటి దారిద్ర్యానికి ఎంత నిగారింపో అన్నట్టు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు.

సుబ్బులుకి వీపంతా పేలడం వల్లా, ఒళ్ళంతా ఇనకా సున్నమూ బడి వరవర లాడుతుంది. గంట సేపట్నుండీ ఒక వట్టాన నిలవనియ్యట్లేదు. మాలెత్తే బొచ్చ కిందేసి, ఒక పుల్ల దీసుకోని రైకకింద గుండా దూర్చి వీపు గోక్కుంటా నిలబడింది.

అప్పుడొచ్చాడు మస్త్రాను. బుర్రు బుర్రున బండి శబ్దం జేసుకుంటా. సుబ్బుల్ని చూసీ చూడగానే కళ్లల్లో మంటలు మండేయి.

"ఏమ్మా తీరిగ్గా కూచ్చోని గీక్కుంటుండావే! పనెపుడు నియ్యబ్బ జేస్తాడా! తీసుకోలేదు తీసుకోలేదంటారు. తీరా తీసుకున్నాక ఇదో ఇదీ తతంగం. ఎంతసేపుటకీ మీ ముడ్డెనకాలే తిరగాలంటే మాకెట్ట కుదురుద్దీ అబ్బబ్బ చెప్పిన పని చెయ్యకుండా తలకాయలు తింటున్నారు గదా!" అంటూ విసుక్కున్నాడు.

సుబ్బులు కళ్లల్లో నీళ్లు తిరిగేయి. గతమంతా వొక్కసారి గిర్రున కళ్లముందు నిలిచింది. ఎట్టాంటి బతుకు బతికీ, ఎట్టాంటి మాటలు వడాల్సొస్తంది. ఎప్పుడూ దేనికీ లోటులేకుండా బతికేను. అడక్కుండానే అన్నీ అమర్చి పెట్టే భర్త మూల్న పడితేనే గదా ఇయ్యాల ఇన్ని మాటలు పడాల్సొస్తుంది. సంపాయించిందంతా ఆసుపత్రికి పొయ్యను సరిపోయింది గదా! చివరికి పసుపుతాడు మిగిలింది. ఇప్పుడు నాలుగు ముద్దలు కడుపునిండా తింటానికే కరువైపాయె. ఎన్నాళ్లిలా కుంటి కూడు తినాలని మంచంలో మురిగి చస్తుండాడు. అనుకుంటూ పైకెక్కి మాలెత్తకపోయి ఇచ్చి నిచ్చెనపై నుంచి దిగింది. రాత్రెప్పుడో తిన్న సంగటి ముద్ద. తింటానికీ టయములేదూ. తిందామన్నా సాలినంతలేదు. ఉండదే తింటంటే మంచంలో ఆయనా పిల్లలూ కనపడతారు. యేపాటు తప్పినా సాపాటు తప్పదుగా! అనుకుంటూ మళ్లీ మాలు తీసుకోని ఒక్కోమెట్టు ఎక్కసాగింది.

"ఇదుగో ఏసోబూ ఇప్పుడు గోడని ప్లాస్టింగ్ జేస్తున్నారు గదా! ముందది పూర్తి చెయ్యండి. ఒగ్గంట ఆలిస్సెం అయినా కూళ్లు తరవాత తిందురుగాని ఆ ఫ్లోర్ అంతటితో అయిపోతే మొత్తానికి సాయంత్రం క్యూరింగ్ చెయ్యాల. దానికి ఎమర్జన్సీ ఆఫరుందంట" అంటూ పురమాయించాడు. సుబ్బులు గుండెల్లో రాయి బడింది. అప్పటికే కాళ్లూ చేతులూ గాల్లో తేలిపోతుండయ్యి. ఒక ముద్ద తిందామంటే ఇప్పుడేగా అరిసి గోల జేసిపోయే. ఇప్పుడుమళ్లీ కూటిగ్గూసుంటేగానీ అమ్మా తల్లీ ఇంక దయచేయండమ్మా అంటా ముడ్డికి తాటాగ్గట్టి తరుముతాడు.

మొట్ట మొదట్లో మెట్టు కొచ్చినప్పుడు బక్కగా పీలగా గాలి కొడితే తేసిపోయేట్టుండే నన్ను జూసి పన్లోకి వొద్దంటే వొద్దని ఆరోజు మునిగాళ్ల మీదే నిలబెట్టారు. చివరికి అయ్యా నేను మేస్త్రిరి యెంకటస్వామి పెళ్లాన్నయ్యా, ఆయన అవిటి వాడయ్యింది మొదులు నేను రోడ్డున పడ్డానంటే అప్పుడు గదా దయతలిచి పన్లోకి తీసుకుంది.

అట్టాంటిది ఏకాస్తె తేడా వొచ్చినా ఈ కరువు రోజుల్లో పని పోగొట్టుకుంటే ఇంక తిన్నట్టే అనుకుంటూ బాదని పళ్ళబిగువున దిగమింగుకోని నిచ్చెన ఎక్కి దిగుతానే ఉంది. కూడు దినకుండా పని జెయ్యమంటాడు ఈడు మణిసో గొడ్డో తెలియడం లేదు. ఆ! ఎవురెట్ట బోయినా వాడి పని వాడికి ముఖ్యం. ఎవురెట్ట బోయినా వాడికెందుకు.

ఆడుకోవాల్సిన వొయిసులో పిల్లముండని పసిదానికాడ వొదిలి పెట్టొచ్చి ఈళ్లకి అరవ శాకిరీ జేస్తంటే, ఇంకా జెయ్యాల ఇంకా జెయ్యాల అంటా ఒకటే తపన బడి చస్తుండారు. సంపాయించే వోడిగ్గాక ఇంకెపుడికి ఉంటుంది తపన. అనుకుంటూ పైనుండి మెట్లు దిగసాగింది. వొంట్లో సత్తువ లేక కాళ్లల్లో ఒకటే వొణుకు. కళ్లు తేలిపోతుండయ్యి వొళ్లు సోలిపోతంది. ఇంకా పాలే మరవని పసిది ఎట్టుందో! కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగినయ్యి.

ఒక్కో మెట్టుమీద కాలితో తపుడు కుంటూ మెల్లగా మెట్టునుండి మెట్టుకు కిందకి దిగుతా వొణుకుతున్న కాలిని కింద మెట్టు మీదుంచింది. మెట్టు స్థానంలో శూన్యం తగిలింది. ఆలోచనల్లో, వొణుకులో కింద మెట్టు మీద కాలు బెట్టాననుకుని రెండో మెట్టుకి కాస్త పైన కాలుమోపింది. అంతే "అమ్మా" అంటూ పెద్ద ఆర్తనాదం. దబ్బుమని కిందపడిన చప్పుడు మొకంపైన పడిన బొచ్చ. ఆ ఆర్తనాదం విని అందరూ పరుగెత్తుకుంటూ వొచ్చారు. తలనేలకు గుద్దుకుంది. రక్తం వోరదలై మడుగుకట్టింది. నేల ముఖమంతా ఎరుపురంగు పులుముకుంది.

***

మెట్టు జనంతో కిటకిట లాడుతుంది. జనం హడావిడిగా అటీటు తిరుగుతున్నారు. వొచ్చే వోళ్లు పోయేవాళ్లు జయమ్మ దగ్గరాగి పక్కనున్న పిల్లని తేరిపార జూసి పోతున్నారు.

ఆ పిల్లని చూస్తుంటే అందరికీ విచిత్రంగా ఉంది. కింద లంగా, దాని చుట్టూ వేసుకున్న పైట వొంటికి చుట్టబెట్టినట్టుగా ఉంది. పైన తొడుక్కున్న రైక డంగడోలుగా ఏదో నాటకం కోసం పిల్లలు తొడుక్కున్న పెద్దోళ్లదిగా అనిపిస్తుంది. జారిపోతున్న పైటని బొడ్లో దోపుకుంటా నానా అవస్థ పడుతుంది.

ఎప్పుడూ చూడని అంత జనాన్ని చూసి లేడి కళ్లల్లో కనిపించే బెదురులాంటి బెదురు కనిపిస్తుంది. వొంటిపై బట్టలతో ఎంత పెద్దరికం తెచ్చుకున్నా మొఖంలో పాలుగారే పసితనం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుంది.

అందర్లాగే ఆ అమ్మాయి ఎవరికోసమో ఎదురు చూస్తుంది. చూపుల్నిండా కనిపించే దైన్యం. చూపుల్నిండా పసితనం జార్చిన కన్నీటి ఛాయలు.

ముద్దుముద్దు మాటలు పలికే సుజాత నోటినుండి

"జయమ్మత్తా మనకి పనిదొరుకుతుందా"! అన్నమాట వినపడింది. జయమ్మ ఉలిక్కి పడింది. ఎక్కడో నాభినుండి పెగిలిన దుఃఖం కంటిలో చెమ్మగా మిగిలింది.

*(కూలీలు, బేల్దారి కూలీలు ఒక చోటికి చేరే ప్రాంతాన్ని మెట్టు అంటారు)*

## మనీషంటే మనీషే!

బాలీవుడ్‌లో దర్శకనిర్మాతగా మారిన ఒకానొక రచయిత. ఒకప్పుడు ముంబయిలోని ఒక 'కోఠా'లోని సుందరాంగి జీవితకథ విని. దాన్ని సినిమాగా తీయాలనుకున్నాడు. కొంత కాలానికి ఆ సుందరి కాస్తా ఎవరినో నిజంగానే ప్రేమించేసి. అతనితో పరారైపోయి. ఈ రచయితకు బాధ కలిగించింది. తరువాత నటి మనీషాకోయిరాలాతో ఈ సంగతి ప్రస్తావించి. సినిమా తీస్తానంటే తక్షణం అంగీకరించిన మనీష. నామినల్‌గా నూటొక్క రూపాయలు తీసుకుంటానందట. అగ్రిమెంట్ పారితోషికంగా. ఆ కోఠాకు కూడా అచ్చమైన నాట్యగత్తె వేషంలో వెళ్లిందట కూడా. మనీషా. మజాకా?

